## క్లుప్తంగా

### నకిలీ విత్తనం విక్రయిస్తే చర్యలు

**కడప అగ్రికల్చర్:** విత్తన దుకాణదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని కడప మండల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పలు విత్తన దుకాణాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీలర్లు లైసెన్సులు కలిగి ఉన్నారా? లేదా? అనుమతి పొందిన విత్తనాలను అమ్ముతున్నారా? అని క్షుణ్ణంగా పరిశీలించారు. రిజిష్టర్, బిల్ బుక్ పరిశీలించి డీలర్లకు సూచనలు చేశారు. వ్యవసాయశాఖ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే అమ్మాలని తెలియజేశారు.

### డాక్టర్ లక్ష్మీనాయక్‌కు సత్కారం

**కడప రూరల్ :** ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మీనాయక్‌ను ఏపీ రాష్ట్ర మాల మహానాడు (జాకట విజయశేఖర్ వర్గం) జిల్లా అధ్యక్షులు చెంచుల డేవిడ్ రాజు ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక ఆ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ లక్ష్మీనాయక్ విధి నిర్వహణలో అధికారులు, ప్రజల మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, ల్యాబ్ టెక్నిషియన్ జహీంగీర్ బేగ్, ఎం.ఓబులేసు టైపిస్టు మనోజ్, పీర్‌బాష పాల్గొన్నారు.

### ఆచార్య రఘునాథరెడ్డి సేవలు ప్రశంసనీయం

**కడప ఎడ్యుకేషన్ :** వైవీయూ కళాశాల అభివృద్ధిలో రఘునాథ రెడ్డి సేవలు ప్రశంసనీయమని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపల్‌గా రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న రఘునాథరెడ్డిని వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రిన్సిపల్‌గా నలుగురు వైస్ ఛాన్సలర్ల పరిపాలనలో సమర్థవంతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. హాస్టళ్ల నిత్య పర్యవేక్షణ, బాలికల ఆత్మ రక్షణ శిక్షణ అమలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### గోపాల్ రెడ్డికి సన్మానం

**కడప రూరల్:** కడప ప్రభుత్వ క్యాన్సర్ కేర్ సెంటర్ పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న గోపాల్ రెడ్డి శనివారం పదవీ విరమణ పొందారు. ఈయన వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ తన పదోన్నతిపై పరిపాలనాధికారిగా వచ్చి పదవీవిరమణ పొందారు. రిమ్స్ పరిపాలన విభాగం సీనియర్ అసిస్టెంట్ శ్యామల, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ బత్తనయ్య ,సిబ్బంది వెంగళరావు, సి వై చందన తదితరులు గోపాల్ రెడ్డిని సన్మానించారు.

### యువతను బలోపేతం చేయాలి

**కడప కార్పొరేషన్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగాన్ని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా నియమితులైన షేక్ షఫీవుల్లా శనివారం రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసి పూలమాలలతో సత్కరించారు. అనంతరం మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, బద్వేల్ ఎమ్మెల్యే డా.దాసరి సుధ, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మెన్ పులి సునీల్ కుమార్‌లకు శాలువాకప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని షఫీవుల్లాకు సూచించారు.

### 4న బాలసుబ్రహ్మణ్యం జయంతి

**కడప సెవెన్‌రోడ్స్ :** గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని జూన్ 4న కడప ప్రెస్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి సారెడ్డి రామశేఖర్ రెడ్డి తెలిపారు. బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన పాటలతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంగీత విభావరి ఉంటుందన్నారు. సంగీతాభిమానులు, గాయకులు ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. వివరాలకు 79890 62436 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

### రక్తదాన శిబిరం

**కడప ఎడ్యుకేషన్ :** కడప మెడికేర్ హాస్పిటల్‌లో శనివారం డాక్టర్ మహబూబ్ అలీ మరియు ఖూన్ కా రిస్తా తారిఖ్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. డాక్టర్ మహబూబ్‌అలీతోపాటు 15 మంది రక్తదానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అన్ని దానాలలో రక్త దానం చాలా ఉత్తమమైనదన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

**కడప సెవెన్‌రోడ్స్ :** రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్.కొండయ్య కోరారు. ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సాగర్‌ను శనివారం ఆయన అభినందించారు. సాగర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ల అసోసియేషన్, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### రుద్రాభిషేకం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక పెన్నానదీ తీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో శనివారం మరకత లింగేశ్వరుడికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవ మూర్తులకు, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, విశేష పూజలు చేశారు.

# అన్నదాత ఆందోళన

ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే పలకరించాయి. జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. రైతన్నలు దుక్కలు చేస్తున్నారు. దీనికి తోడు మరో రెండు రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానుంది. రైతులు పంటల సాగుకు కాడి, మేడి సిద్ధం చేసుకుంటున్నారు. ఇక పంటలసాగుకు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ నిధుల విడుదలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతో అన్నదాతలు పంట పెట్టుబడికి చిల్లిగవ్వలేక ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది కూడా అప్పులు చేసుకోవాల్సిందేనని ఆవేదన చెందుతున్నారు.

- ప్రభుత్వం కొలువుదీరి ఏడాదవుతున్నా ఊసేలేని సాయం
- నేటికీ అన్నదాత సుఖీభవపై స్పష్టత ఇవ్వని చంద్రబాబు
- మరో వారం రోజుల్లో ప్రారంభంకానున్న ఖరీఫ్ సీజన్
- వైసీపీ ప్రభుత్వంలో రైతులకు రూ.13.68 కోట్ల లబ్ధి



దుక్కులు చేస్తున్న రైతులు

**కడప అగ్రికల్చర్ :** రైతులు పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం(వైఎస్సార్ రైతు బరోసా) అందించి రైతులకు అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ సాయం రూ.6వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7500 కలిపి ఏడాదికి రూ.13500 రైతు ఖాతాకు పలు విడతల్లో రైతులకు జమ చేసింది. ఇందులో తొలి విడత ఖరీఫ్ ఆరంభంలో, రెండో విడత కోతల సమయంలో, మూడో విడత ధాన్యం ఇంటికి చేరే వేళ రైతులకు అందించింది. ఇలా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఐదేళ్లపాటు 13.68 కోట్లను అందించింది. దీంతోపాటు భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతోపాటు ఆటవీ, దేవాదాయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద సాయం అందించింది. రాష్ట్ర ప్రభుత్వం రూ. 5500 కలిసి మొత్తం రూ. 7500 సాయాన్ని రైతుల ఖాతాలకు క్రమం తప్పకుండా జమ చేసింది.

| గడిచిన ఐదేళ్లలో కడప నియోజకవర్గంలో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద విడుదలైన నిధుల వివరాలిలా.. | | |
|---|---|---|
| సంవత్సరం | రైతుల సంఖ్య | విడుదలైన నిధులు (కోట్లలో) |
| 2019-20 | 2634 | 3,55,05.900 |
| 2020-21 | 2154 | 2,90,79,000 |
| 2021-22 | 1962 | 2,64,87,000 |
| 2022-23 | 1679 | 2,26,66,500 |
| 2023-24 | 1714 | 2,31,39,500 |

**కూటమి ప్రభుత్వంలో శూన్యం**

కానీ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.14 వేలు అందిస్తామని ప్రకటించింది. ఏడాది కావస్తున్నా ఒక్క రుపాయి కూడా రైతు ఖాతాలకు నగదు జమచేయలేదు. కనీసం ఈ ఖరీఫ్ సీజన్‌కైనా అన్నదాత సుఖీభవ నిదులను విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఇటు కౌలు రైతులకు పెట్టుబడి సాయాన్ని అందిస్తుందా? లేదా? అనే విషయంలోనూ స్పష్టత లేదు.

**సకాలంలో ఇస్తే రైతులకు మేలు**

రైతులు పంటలసాగు కోసం ప్రభుత్వం అందించే రైతు భరోసా సకాలంలో ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది. అలా కాకుండా రైతు అప్పు తెచ్చుకుని పంటలన్నీ సాగు చేసుకున్నాక ఇస్తే ఆ డబ్బుతో రైతులకు ఏం లాభం. అప్పు తెచ్చుకున్న డబ్బు వడ్డీకి సరిపోతోంది. అలాకాకుండా రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం ఆలోచించాలి.

- మునిరెడ్డి, పాతకడప

**పంటలసాగు సమయంలో వేస్తే..**

రైతులు పంటలు సాగు చేసే సమయంలో అన్నదాత సుఖీభవ వేస్తే బాగుంటుంది. ఎందుకంటే బయట నుంచి పూర్తిగా అప్పులు తెచ్చుకోకుండా అంతో ఇంతో రైతుకు ఖర్చులకు సాయంగా ఉంటుంది. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి. పెట్టబడి సాయం అందిస్తే పంటలు సాగు చేసుకునేందుకు ఉపయోగపడుతుంది.

- నాగేశ్వరరెడ్డి, రైతు, కడప

## ఎన్నికలప్పుడు హామీలిచ్చి.. ఇప్పుడు గాలికొదిలేశారు

**మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పిలుపు**



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

**కడప కార్పొరేషన్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలప్పుడు ఎన్నో హామీలిచ్చి.. ఇప్పుడు గాలికొదిలేశారని మేయర్ కె.సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. స్థానిక మాజీ డిప్యూటీసీఎం క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అబద్ధపు హామీలు కుమ్మరించి ఏడాది పూర్తవుతున్నా . వందల హామీలిచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌నే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు ప్రజలను వెన్నుపోటు పొడవటం లెక్కకాదన్నారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సీఎంగా ఉండి ఉంటే ఈపాటికి ఎన్నో హామీలు అమలయ్యేవని, డీబీటీ ద్వారా నగదు వారి ఖాతాల్లో జమ అయ్యేదన్నారు. తాము ఎంతగా మోసపోయామో ఇప్పుడిప్పుడే ప్రజలకు అర్థమవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఈ విషయాలను తెలిపి జూన్ 4న నిర్వహించే 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పులి సునీల్, యానాదయ్య, పి.జయచంద్రారెడ్డి, బీహెచ్.ఇలియాస్, సీహెచ్.వినోద్, రామ్మోహన్‌రెడ్డి, దాసరి శివ, బంగారు నాగయ్య, దేవిరెడ్డి ఆదిత్య, షంషీర్, షఫీ, పి.క్రిష్ణమూర్తి, పత్తిరాజేశ్వరి, రత్నకుమారి, సుశీలమ్మ, తులశమ్మ, పాల్గొన్నారు.

## పిచ్చమ్మ ఇంటి కూల్చివేతదారులను శిక్షించాలి



ఎస్పీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** కడపలో వృద్ధురాలు పిచ్చమ్మ ఇంటిని కూల్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. ఎస్పీ జి.అశోక్ కుమార్‌ను గురువారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివానందపురంలో ఎస్సీ కాలనీలో జీవనం కొనసాగిస్తున్న భూమన పిచ్చమ్మ రూ. 4లక్షల అప్పు తీసుకుంటే.. అసలు, వడ్డీ రూ.20లక్షలు చెల్లించాలంటూ బాలగురువయ్య, కుటుంబ సభ్యులు బెదిరించడమేగాక, సామగ్రి బయట వేసి ఆమె ఇంటిని కూల్చివేశారన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ సమర్పించి పిచ్చమ్మ స్థానిక రిమ్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్తే మీ డాక్యుమెంట్స్ తీసుకురండి.. వాళ్ల వద్ద దగ్గర అన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయని చెప్పడం దారుణం అన్నారు. వడ్డీ వ్యాపారస్తులకు అండగా సీఐ, ఎస్ఐలు వృద్ధురాలిని బెదిరించి పంపారన్నారు. పిచ్చమ్మకు న్యాయం చేయాలని ధర్నా చేస్తే తహసీల్దారు విచారించి ఆ స్థలం పిచ్చమ్మదే అని నిర్ధారించారన్నారు. బాలగురువయ్య ఫేక్ డాక్యుమెంట్ చూపితే.. నిందితులకు అండగా రిమ్స్ సీఐ,ఎస్ఐలు బెయిలబుల్ కేసు పెట్టారన్నారు. అక్రమార్కులకు అండగా నిలిచిన రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్‌లను సస్పెండ్ చేయాలని కోరారు. పిచ్చమ్మ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. నిందితులు బాల గురువయ్య, బాలచంద్ర, బాలకుమార్, బాలుడు, మురళి, ఓబులేసు, ఓబులపతి, లక్ష్మీదేవి, బాలశివమ్మ, భారతిలను కఠినంగా శిక్షించాలని కోరారు. టాటా ఏసీ ఆటో, జెసీబీలను సీజ్ చేసి చేయాలన్నారు. ఎస్పీని కలిసిన వారిలో యస్.వెంకటశివ, ప్రసాద్, మద్దిలేటి, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, వెంకటసుబ్బయ్య ఉన్నారు.

## శిక్షణా తరగతులు వాయిదా వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీ రాజా

**కడప ఎడ్యుకేషన్ :** సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జరపతలపెట్టిన ఉపాధ్యాయ శిక్షణ తరగతులను వాయిదా వేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయ బదిలీలు జరుగుతున్నందున శిక్షణ తరగతులను వాయిదా వేయాలని కోరారు. గందరగోళ పరిస్థితుల మధ్య ఉపాధ్యాయుల బదిలీలు చేయడం ఆందోళన కలిగిస్తోందని, ఈ పరిస్థితులలో తరగతులకు హాజరుకావాలంటూ ఆదేశాలు జారీ చేయడం సబబు కాదన్నారు. బదిలీలు ముగిసేంత వరకూ శిక్షణ తరగతులు, ఆడిట్ నిర్వహణ వాయిదా వేయాలని, లేని పక్షంలో వాటిని బహిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, కృష్ణారెడ్డి, సీవీ.రమణ, ఎజాస్‌అహ్మద్, ప్రకాష్‌బాబు, గంగన్న, అస్లాంబాషా, శ్రీనివాసులు, విజయకుమార్, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

## దుకాణాల్లో అధికారుల తనిఖీలు

**కడప కోటిరెడ్డి సర్కిల్ :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా జూన్ 1వ తేదీ నుంచి నెలరోజులపాటు నగరంలోని దుకాణాలు, ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టనున్నట్లు కార్మిక శాఖ ఉప కార్మిక కమిషనర్ శ్రీకాంత్ నాయక్ తెలిపారు. డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుకాణాలు, వాణిజ్య సంస్థలు, హోటళ్లు, సినిమా థియేటర్లు, మెకానిక్ షెడ్లు, వెల్డింగ్ షాపుల్లో బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. చట్టాలకు వ్యతిరేకంగా బాల, బాలికలు పని చేస్తున్నట్లు గుర్తిస్తే సంస్థ యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకారం అందించాలని కోరారు.

## పది పరీక్ష పత్రాల మూల్యాంకనంలో విఫలం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** పది పరీక్ష పత్రాల మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు అన్నారు. నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పరీక్ష ఫలితాలు ముందస్తుగా విడుదల చేశామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రచారం చేస్తున్నారని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 66,363 మంది విద్యార్థులు రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేశారని తెలిపారు. 11,000 మంది పైచిలుకు విద్యార్థులు రీవాల్యుయేషన్ ద్వారా పాసయ్యారన్నారు. చాలా మంది ట్రిపుల్ ఐటీలో సీట్లు కోల్పోయామని బాధపడుతున్నారన్నారు. మంత్రి లోకేష్ ఇప్పటి వరకూ సమస్య పరిష్కరిస్తామని స్పందించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తరగతులు జరగక, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రిమ్స్ మెడికల్ కళాశాల హెచ్ఓడీ శోభారాణి కక్షపూరితంగా హాజరు లేదని 21 మంది డీఎంఎల్‌టీ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించకుండా అడ్డుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అకీరానంద్, తేజ, అరుణ్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్ కోసం రోగుల నిరీక్షణ



మాట్లాడుతున్న ఆర్‌సీపీ నాయకులు

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** రిమ్స్ జనరల్ హాస్పిటల్‌లో క్యూఆర్ కోడ్ కోసం గ్రామీణ ప్రాంతాల నిరక్షరాస్యులు, ఆండ్రాయిడ్ సెల్ లేని పేదలు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆర్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మడగలం ప్రసాద్, రాయలసీమ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి తస్లిమ్ అన్నారు. నగర శివారులోని రిమ్స్ జనరల్ ఆస్పత్రిలో శనివారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారంలోని మొదటి రోజుల్లో రోగుల సంఖ్య అధికంగా ఉంటుందని, క్యూఆర్ కోడ్ నమోదు చేసే సిబ్బందిని మరింత పెంచాలని సూచించారు. ఆసుపత్రిలోనే కాకుండా ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డు తరహాలో ఇంటి నుంచే ఆశా వర్కర్లు, ఏఎన్ఎం, జీఎన్ఎం వర్కర్ల ద్వారా ముందుగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే వేళల్లో కార్డును వెంట తెచ్చుకోవాలని, తద్వారా సేవలు పూర్తి చేసుకోవడానికి ఉపయోగపడతాయన్నారు.

## అక్రమ అడ్మిషన్లు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకపోయినా.. బురిడీ మాటలతో దోపిడీ చేస్తున్న విద్యా సంస్థలను సీజ్ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అభినయ్, ఉదయ్, పాల్గొన్నారు.



## శక్తి యాప్‌తో మహిళలకు భద్రత



శక్తి యాప్‌ను ప్రదర్శిస్తున్న దంత వైద్య విద్యార్థినులు

**కడప అర్బన్ :** శక్తి యాప్‌తో మహిళలకు భద్రత లభిస్తుందని, శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ అన్నారు. నగరంలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాల విద్యార్థులకు శనివారం శక్తియ యాప్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆపద సమయంలో మహిళలు, బాలికలు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112 ద్వారా ఫిర్యాదు చేసిన పది నిమిషాల్లో పోలీస్ అధికారులు చేరుకొని సమస్య పరిష్కరిస్తారన్నారు. చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100, 112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళా వేధింపులు 1091, సైబర్ టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్రలను సంప్రదించి పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సుప్రజ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పొగ తాగడం ప్రమాదకరం

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** పొగ తాగడం ప్రమాదకరమని, ఆ అలవాట్లకు దూరంగా ఉండాలని డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగ తాగడంతో వచ్చే అనారోగ్య సమస్యలపై గోడ పత్రాలను వారు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగ తాగడం మాన్పించి యువతను రక్షించుకుందామని, పొగ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, వర్షిత సింహా, తదితరులు పాల్గొన్నారు.

**పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం**

పొగాకు వాడకం కేన్సర్ మహమ్మారికి కారణంగా మారగలదని ఫాతిమా మెడికల్ కళాశాల వైద్యులు తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొంతమంది సరదా కోసం పొగాకు తాగడం అలవాటు చేసుకుంటే వ్యసనంగా మారుతుందన్నారు. ఈ అలవాటుకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నాగేష్, రామమనోహర్‌రెడ్డి, చంద్రశేఖర్, ఉమా సుందరి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

**నో టొబాకో పోస్టర్ల ఆవిష్కరణ**

**కడప ఎడ్యుకేషన్ :** ప్రపంచ పొగాకు దినోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ అవార్డు గ్రహీత డాక్టర్ ప్రభాకర్ జాల నో టొబాకో పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కడప నగరంలోని ట్రంక్ రోడ్‌లోని మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టొబాకో వాడకుండా జాగ్రత్తగా ఉండి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు.

## తక్షణమే విచారణ జరపాలి





విలేకర్లతో మాట్లాడుతున్న ఓబులేసుయాదవ్

**కడప ఎడ్యుకేషన్ :** పది పరీక్ష పత్రాల మూల్యాంకనంలో తప్పు చేసిన ఘటనపై విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసుయాదవ్ డిమాండ్ చేశారు. కడపలోని ఆర్ఎస్ఎఫ్ కార్యాలయంలో ఏపీ దళిత మిత్ర సంఘం అధ్యక్షుడు కైపు రామాంజనేయులు, ఆర్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రెడ్డిసాయిలతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 6లక్షల మందికి పైగా పదవ తరగతి పరీక్షలు రాశారన్నారు. ఫెయిల్ అయి, తక్కువ మార్కులు వచ్చిన 66,363 వేల మంది విద్యార్థులు పేపర్ల మూల్యాంకనానికి దరఖాస్తు చేయగా, 11వేల మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రీ వాల్యుయేషన్ తర్వాత ఫెయిలైన కడప జిల్లా యర్రగుంట్లకు చెందిన మోక్షితకు 84, బాపట్ల జిల్లాకు చెందిన తేజస్వినికి 96, విజయవాడకు చెందిన రాజేశ్వరికి 95 మార్కులు వచ్చాయన్నారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ట్రిపుల్ ఐటీ, మోడల్ స్కూల్స్, కస్తూర్బా విద్యాసంస్థల్లో చేరే అవకాశం వారు కోల్పోయారన్నారు.



### • ఆదమరిస్తే అంతే..





కడప నగరం నడిబొడ్డున శివలింగం బీడీ ఫ్యాక్టరీ వద్ద రోడ్లపై మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. బళ్లారి రోడ్డులో ఓ మ్యాన్‌హోల్, మరో గుంత ఏర్పడ్డాయి. వాటిని పూడ్చివేయాలని ఐదారు నెలలుగా కార్పొరేషన్ అధికారులకు చెప్పినా పట్టించు కోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప